గోల్కొండ కోటలో పర్యాటకుల తిప్పలు


కోట ముందు మూసి ఉన్న షాపు ముందు కూర్చొని భోజనం చేస్తున్న పర్యాటకులు

గోల్కొండ: ప్రసిద్ధ పర్యాటక కేంద్రమైన గోల్కొండ కోటకు ప్రతినిత్యం వేల సంఖ్యలో పర్యాటకులు వస్తుంటారు. సెలవు రోజుల్లో పెద్ద ఎత్తున కోటకు నగరం నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి పర్యాటకులు భారీ సంఖ్యలో వస్తుంటారు. నగరం నుంచి వచ్చే పర్యాటకులు తమ వెంట భోజనంతో పాటు ఇతర తినుబండారాల్లు కూడా తీసుకోని వస్తారు. అయితే కోటలోపలికి నీటి బాటిల్స్ గానీ, భోజన ప్యాకెట్లు, టిఫిన్ క్యారియర్లు గానీ లోపలికి తీసుకువెళ్లడానికి అనుమతి లేదు. దీంతో పర్యాటకులు తమ వెంట తెచ్చుకున్న తినుబండారాల్లను కౌంటర్‌లో డిపాజిట్ చేసి వెళ్లాల్సి వస్తుంది. కోట సందర్శన అనంతరం తమతమ వస్తువులను తీసుకుంటారు. అయితే భోజనం చేయడానికి మాత్రం వారికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కోట ఎదురుగా ఉన్న ఫుట్‌పాత్‌లు అన్ని కబ్జాకు గురయ్యాయి. అక్కడ కూర్చొని తినడానికి వీలు లేకుండాపోతుంది. కుటుంబంతో వచ్చిన పర్యాటకులు కోటను చూసిన అనంతరం ఆకలితో ఉంటారు. గత్యంతరం లేకపోవడంతో వీరంతా రోడ్డు పక్కన, కోట ముందు గల రోడ్డుపై మూసి ఉన్న షాపుల ముందు తింటున్నారు. ఇదిలా ఉండగా తమ వెంట టిఫిన్ బాక్సులు, భోజన క్యారియర్లు తెచ్చుకోని పర్యాటకులు సైతం మధ్యాహ్న భోజనానికి టిఫిన్‌లు చేయడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గోల్కొండ కోటలో క్యాంటిన్ లేకపోవడంతో వీరంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు శాఖాహారులకు సైతం కోట బయట శాఖాహార హోటల్ లేకపోవడం సైతం పర్యాటకులను ఇబ్బంది కలిగిస్తుంది. ఈ నెల 13వ తేదీన హైదరాబాద్‌లో పోలింగ్ జరిగిన సందర్భంగా షాపులు, హోటల్స్ అన్ని మూసి ఉన్నాయి. ఆ రోజు సైతం పర్యాటకులు పెద్ద ఎత్తున వచ్చారు. అయితే వారికి ఆ రోజు కోటలో ఇతర షాపులు మూసి ఉండడంతో భోజనం కాదు కదా తాగునీరు సైతం లభించలేదు. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో గల కోటలో పర్యాటకులకు కనీస సౌకర్యాలు కల్పించాలని పలువురు పర్యాటకులు కోరుతున్నారు.

వైద్యం నామమాత్రం

అందుబాటులో లేని వైద్య సేవలు..
- డాక్టర్ లేకున్నా...వైద్య సేవలు అందిస్తున్న సిబ్బంది..
- శిథిలావస్థలో భవనాలు... పట్టించుకోని ఉన్నతాధికారులు...
- కరువైన ఉన్నతాధికారుల పర్యవేక్షణ..
- శిథిలావస్థలో దారుషిపా యుపీహెచ్‌సీ భవనం
- వైద్య సేవలు విస్తరించాలంటున్న రోగులు


డాక్టర్ లేకున్నా...కిందిస్థాయి సిబ్బంది అరకొర వైద్య సేవలు

చార్మినార్: పాతబస్తీలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్-యుపీహెచ్‌సీ) పేద రోగుల ఆరోగ్య సమస్యలను తీర్చడం లేదు. కొన్ని నామమాత్రంగా పని చేస్తుండగా మరికొన్నింట్లో సిబ్బంది కొరత ఎక్కువగా ఉంది. చాలీచాలని వైద్య సిబ్బంది పేద రోగులకు అవసరమైన వైద్య సేవలను అందించడంలో వెనుకబడుతున్నారు. కొన్ని ఆసుపత్రుల్లో ఇప్పటికీ డాక్టర్లు అందుబాటులో లేరు. ఎక్కడైనా ఉన్నా..ఎప్పుడొస్తున్నారో..ఎప్పుడు వెళుతున్నారో..తెలియని దుర్భర పరిస్థితులు పాతబస్తీలో నెలకొన్నాయి. ఆయా రాం..గయా రాం..అన్న చందంగా పాతబస్తీలో వైద్యులున్నారు. సకాలంలో వైద్యులు ఆయా ఆసుపత్రులకు చేరకపోవడంతో కిందిస్థాయి సిబ్బందే తమకు తోచిన వైద్య సేవలు అందిస్తున్నారు. మరికొన్ని ఆరోగ్య కేంద్రాల భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. మరమ్మత్తులు చేయకపోవడంతో రోగులు ఇబ్బందులకు గురవుతున్నారు.

భవనం ఎప్పుడు కూలుతుందోనని..
చార్మినార్ నియోజక వర్గం పురానీహవేలీ చౌరస్తాలోని దారుషిపా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యుపిహెచ్‌సీ) భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. ఎప్పుడు కూలుతుం దోనని ఇక్కడి కిందిస్థాయి వైద్య సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధినిర్వాహణ కొన సాగిస్తున్నారు. ట్రిబ్యునల్ కోర్టు సమీపంలోని ఈ భవనంలో ఎన్నో దశాబ్దాలుగా ఆరోగ్య కేంద్రం పని చేస్తుంది. ప్రస్తుతం అర్బన్ ప్రైమరి హెల్త్ సెంటర్‌గా.. కొత్తగా బోర్డు మాత్రమే ఏర్పాటు చేసిన సంబంధిత అధికారులు వైద్య సేవలను విస్తరించకపోగా... శిథిలావస్థలోని ఈ భవనాన్ని పట్టించుకోవడం లేదు. స్థానిక పేద రోగులకు ఏళ్ల తరబడి అందుబాటులో ఉన్న ఈ ఆరోగ్య కేంద్రం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుని కూలిపోతోంది. ఇప్పటికే గోడలు కూలి పోయాయి. వర్షాకాలంలో పైకప్పు పూర్తిగా తడిసిపోయి వర్షం నీరు లీక్ అవుతుందని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాధ్యమైనంత వెంటనే మరమ్మత్తులు చేయించి పూర్తిస్థాయిలో వైద్య సేవలను అందజేయాలని రోగులు కోరుతున్నారు.

అరకొర వైద్యం..
దగ్గు, జ్వరం, తలనొప్పి, కాళ్లనొప్పులు... ఇలా చిన్న చిన్న రోగాలకు తమకు తెలిసిన ఆంటిబయాటిక్స్ మందులను ఇస్తున్నారు. సిప్రోఫ్లోక్సాసిన్, పారసెట మాల్ ట్యాబెట్లు,సరప్‌లను పేద రోగులకు అందజేసి చేతులు దులుపుకుంటున్నారు. ఇదేమని ప్రశ్నించే అధికారులెవరు లేరు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ అసలే లేదు. ఆయా ఆరోగ్య కేంద్రాలకు కేటాయించిన వైద్యులు ఎక్కడికెళుతున్నారో సంబంధిత ఉన్నతాధికారులకు తెలియాలి. పేద రోగులు మాత్రం అరకొర వైద్య సేవల పట్ల పడరాని పాట్లు పడుతున్నారు. కొన్ని ఆరోగ్య కేంద్రాల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి.

జూన్ 6 వరకు 144 సెక్షన్

నాంపల్లి: అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో జూన్ 6వ తేదీ వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందని నాంపల్లి శాంతిభద్రతల పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ అభిలాష్ పేర్కొన్నారు. మాసబ్‌ట్యాంక్‌లోని డీఆర్‌సీ సెంటర్‌కు వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో శాంత్రిభద్రతల పరిరక్షణ, జేఎన్‌ఏఫ్‌ఏయూ ఫైన్ ఆర్ట్ వర్శిటీలో ఈవీఎం మిషన్లను భద్రపరచడం, కౌంటింగ్ కూడా అక్కడే జరుగుతున్న దృష్ట్యా దీనిని అమలు చేస్తున్నట్లు తెలిపారు. అయిదు లేదా అంత కన్నా ఎక్కువ మంది ఒకచోట గుమిగూడవద్దని, బహిరంగ సభలకు, ఇతరత్రా వాటికి ముందస్తు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని, బహిరంగ ప్రదేశాల్లో బాణసంచా పేల్చరాదని సూచించారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే ఐపీసీసీ సెక్షన్ 188 కింద శిక్షార్హులు అవుతారని స్పష్టం చేశారు.

కూల్ కూల్‌గా..

గోల్కొండలో కూలర్ల అమ్మకాలు

గోల్కొండ: ఎండవేడిని భరించలేక ప్రజలు కూల్‌కూల్‌గా ఉండడానికి మొగ్గు చూపుతున్నారు. ఏసీలు కొనలేని పేద, మధ్య తరగతి ప్రజలు ఎయిర్ కూలర్‌లను కొంటున్నారు. గత వారం రోజులుగా ఎయిర్ కూలీలకు భాగా గిరాకీపెరిగింది. మెహిదీపట్నం, గోల్కొండ, గుడిమల్కాపూర్ తదిత ప్రాంతాల్లో కూలర్‌లు అమ్ముడవుతున్నాయి. గతంలో ఎన్నడు లేని విధంగా ఉష్ణోగ్రతలు పెరిగిపోతుండడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. పిల్లల పరిస్థితి మరి దారుణంగా ఉంది. ఫ్యాన్‌లు ఉన్నా కూడా చెమటతో బట్టలు తడిచిపోతున్నాయి. కూలర్లతో ఉపశమనం పొందేందుకు వీటిని కొంటున్నారు. వివిధ సైజుల కూలర్ల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. షాపుల వారు సైతం టెబుల్ కూలర్లను కొంటున్నారు. టెబుల్ కూలర్లతో పాటు రూమ్ కూలర్లు పెద్ద సంఖ్యలో అమ్ముడవుతున్నాయి.

సెల్‌ఫోన్లు లాక్కెళ్లే దొంగ అరెస్టు


నేరస్తుడి వివరాలను వెల్లడిస్తున్న ఇన్‌స్పెక్టర్ బి.ప్రవీణ్‌కుమార్

నాంపల్లి: రైలు ప్రయాణికుల చేతిలోని సెల్‌ఫోన్లను లాక్కెళ్లే ఓ నేరస్తుడిని నాంపల్లి జీఆర్పీ పోలీసులు అరెస్టు చేశారు. అతడి నుండి రూ.88 వేల విలువ చేసే మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ బి.ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... మాదన్నపేట, రెయిన్‌బజార్ అర్షత్ కాలనీకి చెందిన మహ్మద్ నబీర్ కుమారుడు మహ్మద్ ఖాదర్ అలియాస్ ఖదీర్ అలియాస్ అబ్దుల్(27) వృత్తిరీత్యా టైల్స్ కార్మికుడు. జల్సాలకు అలవాటుపడ్డ కార్మికుడు అబ్దుల్ దొంగతనాలు చేయడానికి అలవాటుపడ్డారు. ఈ క్రమంలో నాంపల్లి రైల్వే స్టేషన్‌లో ఈ నెల 11న ప్లాట్‌ఫారం నెంబరు-1 మీద తన బంధువులకు వీడ్కోలు పలికేందుకు వచ్చిన ఇంద్రజిత్ చేతులోని సెల్‌ఫోన్‌ను లాక్కెళ్లి పారిపోయాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో సీసీ కెమెరాల ఆధారంగా నేరం చేసిన అబ్దుల్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా చేసిన తప్పును ఒప్పుకున్నారు. అంతేకాకుండా అతడి దగ్గర ఉన్న మూడు సెల్‌పోన్లను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. ఈ మేరకు అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

ఎంఐఎం నాయకులపై చర్యలు తీసుకోండి


పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న మాణిక్ ప్రభు, ముక్కా కృష్ణాగుప్తా తదితరులు

అబిడ్స్: ఎన్నికల రోజు పాతబస్తీలో మజ్లిస్ పార్టీ నాయకులు అరాచకాలు చేసినా ఎవ్వరూ పట్టించుకోలేదని వారిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ కిసాన్‌మోర్చ గోల్కొండ జిల్లా అధ్యక్షులు మాణిక్ ప్రభు, ప్రధాన కార్యదర్శి ముక్కా కృష్ణాగుప్తాలు డిమాండ్ చేశారు. బుధవారం గుడిమల్కాపూర్ పోలీస్‌స్టేషన్‌లో వారు మజ్లిస్ నాయకుడు యాసర్ అరాఫత్‌తో పాటు అతని అనుచరులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. 13వ తేదీ ఎన్నికల పోలింగ్ రోజు మజ్లిస్ నాయకుడు అరాఫత్ తన అనుచరులతో కలిసి బీజేపీ అభ్యర్థి మాధవీలతను అడ్డుకోవడంతో పాటు ఆమెపై అనుచిత వ్యాఖ్యలు చేశారని పేర్కొన్నారు. ఎన్నికల రోజు పాతబస్తీలో 144 సెక్షన్ ఉన్నా అరాఫత్ పెద్ద ఎత్తున తన అనుచరులతో కలిసి మాధవీలతను అడ్డగించడం దారుణమన్నారు. వెంటనే అతనితో పాటు అతని అనుచరరులపై సెక్షన్లు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఫిర్యాదు పై గుడిమల్కాపూర్ ఇన్‌స్పెక్టర్ బి.రాజును వివరణ కోరగా ఈ ఫిర్యాదును జీడీ ఎంట్రీ నమోదు చేసి న్యాయ నిపుణుల అభిప్రాయం మేరకు ప్రకారం ముందుకు వెళ్తామని పేర్కొన్నారు.

రిగ్గింగ్‌ను అధికారులు నిరోధించలేకపోయారు


రాజేష్ యాదవ్

అబిడ్స్: పాతబస్తీలో మజ్లిస్ పార్టీ పెద్ద ఎత్తున రిగ్గింగ్‌కు పాల్పడినా.. బీజేపీదే విజయమని గ్రేటర్ హైదరాబాద్ బీజేవైఎం నాయకుడు, నగర శ్రీకృష్ణ భారతీయ యాదవ సేవా సమితి అధ్యక్షులు బి.రాజేష్ యాదవ్ పేర్కొన్నారు. పోలింగ్ రోజు మజ్లిస్ పార్టీ పలు ప్రాంతాల్లో రిగ్గింగ్‌లకు పాల్పడినా అధికారులు నిరోధించలేకపోయారని ఆరోపించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ. 40 సంవత్సరాలుగా మజ్లిస్ పార్టీ బోగస్ ఓట్లు రిగ్గింగ్‌లతోనే విజయం సాధించిందన్నారు. నీతి, నిజాయితితో మజ్లిస్ పార్టీ ఏ నాడు పోటీ చేయలేదన్నారు.

మరమ్మతులకు నోచుకోని పబ్లిక్ నీటి ట్యాంకులు


గోల్కొండ సాదత్‌నగర్‌లో పబ్లిక్ నీటి ట్యాంకు దుస్థితి

గోల్కొండ: బస్తీలలో ప్రభుత్వ ఏర్పాటు చేసిన పబ్లిక్‌నీటి ట్యాంకులు మరమ్మత్తులకు నోచుకోవడం లేదు. ప్రజాధనంతో వేసిన ఈ నీటి ట్యాంకులు మరమ్మత్తులకు నోచుకోకుండా వృథాగా పడి ఉన్నాయి. కార్వాన్ నియోజకవర్గంలోని కార్వాన్, గోల్కొండ డివిజన్‌లలో ఎన్నో పబ్లిక్ నీటి ట్యాంకులు మరమ్మత్తులకు నోచుకోకుండా అలాగే ఉంటున్నాయి. అసలే వేసవి కాలం కావడంతో ప్రజలు బిందెడు నీటి కోసం నానా అవస్థలు పడుతున్నారు. గతంలో పబ్లిక్ నీటి ట్యాంకులు, పబ్లిక్ నీటి నల్లాలు ప్రజల నీటి అవసరాలు తీర్చేవి. ఒక బస్తీలో బోరు వేసి దాని ద్వారా పబ్లిక్ నీటి ట్యాంకులకు నీరు సరఫరా అయ్యేవి. అయితే బోర్లు పాడవ్వడంతో ఎన్నో నీటి ట్యాంకర్లు వృథాగా పడి ఉన్నాయి. మరికొన్ని నీటి ట్యాంకులకు మూతలు లేకుండా, కుళాయిలు లేకుండా ఉన్నాయి. దీంతో వీటికి నీటి సరఫరా ఆగిపోయింది. బస్తీల పబ్లిక్‌నీటి ట్యాంకులలో నీరు రాకపోవడంతో ప్రజలు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నల్లాలలో వస్తున్న నీరు తాగడానికే సరిపోతుందని ఇతర అవసరాల కోసం సైకిళ్లు, వాహనాలపై నీటి డబ్బాలు పట్టుకోని గల్లీగల్లీ తిరుగుతున్నామని పలువురు వాపోతున్నారు. సంబంధిత అధికారులు ప్రతి డివిజన్‌లో పర్యటించి పని చేయని పబ్లిక్ నీటి ట్యాంకులకు మరమ్మత్తులు చేసి వాటికి నీటి సరఫరాను పునరుద్దరించాలని బస్తీల వాసులు కోరుతున్నారు.

తీసుకున్న అప్పు అడిగినందుకు దారుణ హత్య


సంఘటనా స్థలంలో అదనపు డీసీపీ స్నేహా మెహ్రా

డూద్‌బౌలి: తీసుకున్న అప్పు తిరిగి ఇవ్వాలని అడిగినందుకు పథకం ప్రకారం తన స్నేహితులే ఒక యువకుడిని దారుణంగా హత్య చేసిన సంఘటన మంగళవారం అర్ధరాత్రి హుస్సేనీఆలం పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. విషయం తెలిసిన వెంటనే దక్షిణ మండలం అదనపు డీసీపీ స్నేహా మెహ్రా, దక్షిణ మండలం డీసీపీ షేక్ జహంగీర్, చార్మినార్ ఏసీపీ చంద్రశేఖర్‌లతో పాలు ఇన్‌స్పెక్టర్ సురేందర్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. క్లూస్ టీం ఆధారాలు సేకరించారు. హుస్సేనీ ఆలం ఇన్‌స్పెక్టర్ సురేందర్ తెలిపిన మేరకు..ఖిల్వత్ పంచ్‌మెహల్లా ప్రాంతానికి చెందిన మహ్మద్‌మక్సూద్ కల్ల జోళ్ల వ్యాపారం చేస్తుంటాడు. తన మిత్రులైన మీర్జాకు అవసరం నిమిత్తం రూ.8 వేలు, మరో మిత్రుడైన షాహెద్‌కు రూ.5 వేలు ఇచ్చాడు. ఇచ్చిన డబ్బు తిరిగి ఇవ్వాలని గత కొంత కాలంగా మిత్రులిద్దరిని అడుగుతున్నాడు. ఇవ్వక పోతే అంతు చూస్తానని బెదిరించడంతో..పథకం ప్రకారం స్నేహితులే మంగళవారం అర్ధరాత్రి మోతీగల్లిలోని ఓ ఫంక్షన్ హాల్ వద్ద హత్య చేసి పరారయ్యారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

జూపార్కులో ఒక్కరోజు వేసవి శిక్షణ


విద్యార్థులతో జూ అధికారులు, సిబ్బంది

బహదూర్‌పురా: నెహ్రూ జూలాజికల్ పార్కులో బుధవారం విద్యార్థులకు ఒక్కరోజు వేసవి శిబిరం నిర్వహించారు. జూ పార్కు క్యూరేటర్ ఎ.నాగమణి శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంలో జంతువుల ప్రవర్తన, వాటి ఆవాసాలు, రోజువారి కార్యకలాపాల గురించి వివరించారు. అనంతరం నైట్ ఎన్‌క్లోజర్లు, సఫారీ పార్క్, బర్డ్స్ ఎన్‌క్లోజర్, నాక్టర్నల్ యానిమల్ హౌస్ తదితర ఎన్‌క్లోజర్ల వద్దకు తీసుకెళ్లారు.

హబీబ్‌నగర్‌లో రెండిళ్లలో చోరీ


దొంగతనం జరిగిన ఇంట్లో తనిఖీలు చేస్తున్న డాగ్ స్క్వాడ్ బృందం

నాంపల్లి: హబీబ్‌నగర్‌లో దొంగలు రెచ్చిపోయారు. ఏక కాలంలో రెండు ఇండ్లలో సొత్తును ఎత్తుకెళ్లారు. హబీబ్‌నగర్ ఇన్‌స్పెక్టర్ టంగుటూరి రాంబాబు తెలిపిన మేరకు.. ఓల్డ్ కమ్యూనిటీ హాలుకు సమీపంలో నియాసత్ అపార్ట్‌మెంట్‌లో షేక్ యాసీన్ కుటుంబం నివాసం ఉంటోంది. ఈయన కుటుంబం మధ్యాహ్నం 2.30 గంటలకు శాస్త్రిపురానికి వెళ్లి తిరిగి వచ్చింది. ఇంటికి వచ్చి చూడగానే ఇంట్లో దాచిన రెండు లక్షల డెబ్బైవేలు నగదు, మూడున్నర తులాల బంగారం దొంగలు దోచుకెళ్లారు. అలాగే కోమటికుంట సమీపంలోని ఓ ఇంట్లో సాఫ్ట్‌వేర్ హమీద్ నివాసం ఉంటున్నారు. ఉదయం 11 గంటలకు ఆఫీస్‌కు వెళ్లి వచ్చి చూసేసరికి ఆయన ఇంటి తలుపులు పగులగొట్టి ఉన్నాయి. అల్మారాలో దాచిన మూడు లక్షల నగదు, 12 తులాల బంగారం ఎత్తుకెళ్లారు. దీంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. వెంటనే డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్ బృందాలు దొంగతనాలు జరిగిన ఇళ్లను పరిశీలించారు.

మనూలో ఎంఏ ఉమెన్స్ స్టడీస్‌లో ప్రవేశాలు

దరఖాస్తుకు జూన్ 30 ఆఖరు

రాయదుర్గం: మనూలోని ఉమెన్స్ స్టడీస్ సబ్జెక్టు విద్యార్థులకు కెరీర్ అవకాశాలు మెండుగా ఉంటాయని 'మనూ' డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఉమెన్ ఎడ్యుకేషన్(డీడబ్ల్యూఈ) హెడ్ ప్రొఫెసర్ అమీనా తహసీన్ బుధవారం తెలిపారు. ఎంఏ విమెన్స్ స్టడీస్‌లో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను సమర్పించడానికి చివరి తేదీ జూన్ 30 అని ఆమె పేర్కొన్నారు. ఏదైనా బ్యాచిలర్ డిగ్రీ లేదా తత్సమాన మదర్సా కోర్సులు ఉన్న విద్యార్థులు మెరిట్ ప్రాతిపదికన ఎంఏ ఉమెన్ స్టడీస్‌లో ప్రవేశం పొందేందుకు అర్హులని ఆమె వివరించారు. ఆన్‌లైన్ దరఖాస్తు, ప్రాస్పెక్టస్ యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు గది నెంబర్ 101 మహిళా విద్యాశాఖ, లెక్చర్ హాల్ కాంప్లెక్స్ మనూ క్యాంపస్‌ను సందర్శించాలని సూచించారు. పూర్తి వివరాలకు ఫోన్ నెంబర్ 9392303545, 9985740884లో సంప్రదించాలని సూచించారు.

సమతుల్య వ్యవసాయంపై ఉద్యాన రైతులకు శిక్షణ


శిక్షణలో పాల్గొన్న రైతులు, అధికారులు

ఏజీవర్సిటీ: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో 'సమత్యుల వ్యవసాయంలో సాంకేతికత' అనే అంశంపై ఉద్యాన రైతులకు బుధవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిధిలోని నీటి సాంకేతిక పరిజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో వారం పాటు జరిగే ఈ శిక్షణ కార్యక్రమానికి పాలేం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రం సహ సంచాలకుడు డాక్టర్ ఎం మల్లారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ మారుతున్న వాతావరణ పరిస్థితుల్లో సమతుల్య వ్యవసాయం ప్రాధాన్యత సంతరించుకుందన్నారు. నీటి సాంకేతిక పరిజ్ఞాన సంచాలకులు వారం పాటు ఉద్యాన పంటలైన కూరగాయలు, పూల తోటల పెంపకంలో ఆధునిక పరిజ్ఞాన వినియోగం, అలాగే పంటల ఎగుమతి అవకాశాలను కూడా రైతులకు వివరించనున్నారు. నేషనల్ కమిటీ ఆన్ ప్రెసిసన్ అగ్రికల్చర్ అండ్ హార్టికల్చర్ ఈ కార్యక్రమానికి సహకారం అందించింది కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారులు ప్రేమ్‌సింగ్, అనిల్ కుమార్ వివిధ జిల్లా యువ రైతులు పాల్గొన్నారు.

వైద్య విభాగంలో నర్సుల పాత్ర కీలకం

రంగారెడ్డి జిల్లా ఆస్పత్రి డాక్టర్ మధుసూదన్‌రెడ్డి


నర్సును సన్మానిస్తున్న డాక్టర్ మధుసూదన్‌రెడ్డి తదితరులు

శేరిలింగంపల్లి: వైద్య విభాగంలో నర్సుల పాత్ర కీలకమని రంగారెడ్డి జిల్లా ఆస్పత్రి సివిల్ సర్జన్ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి అన్నారు. బుధవారం శేరిలింగంపల్లిలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫ్లొరెన్స్ నైటింగేల్ జయంతి సందర్భంగా డాక్టర్ మధుసూదన్‌రెడ్డి ఆమె చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ నర్సులు సేవామూర్తులన్నారు .రోగులకు వైద్యులు ఇచ్చే మందులు ఎంత ముఖ్యమో, నర్సుల సేవలు కూడా అంతే ముఖ్యం అన్నారు. నర్సింగ్ విభాగంలో ఉత్తమ సేవలు అందించిన బీహెచ్‌ఈఎల్, నిమ్స్, గచ్చిబౌలి టిమ్స్, కొండాపూర్‌లోని జిల్లా హాస్పిటల్, శేరిలింగంపల్లి, హఫీజ్‌పేట్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్, ఈఎస్ఐ రామచంద్రాపురం, ఉర్దూ యూనివర్సిటీ, సెంట్రల్ యూనివర్సిటీ హెల్త్ సెంటర్స్, పటాన్‌చెరు ఏరియా హాస్పిటల్ తదితర ప్రాంతాల్లో పని చేసిన 80 మంది నర్సులను సన్మానించారు. అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు విజయలక్ష్మీ, వాణీ సాంబశివరావు, జనార్దన్, పాలం శ్రీను, ధర్మసాగర్, వెంకటేశ్వర్లు, బాలన్న, సంతోషి,లక్ష్మీ పాల్గొన్నారు.

సీబీఎస్ఈలో 'మనూ మోడల్ స్కూల్' వందశాతం ఉత్తీర్ణత

రాయదుర్గం: సీబీఎస్ఈ ప్రకటించిన ఫలితాల్లో మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని మోడల్ స్కూల్‌లోని పదవ తరగతి, 12వ తరగతి విద్యార్థులు సత్తా చాటారు. పదోతరగతిలో 47 మంది విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించారని పాఠశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ డాక్టర్ కఫీల్ అహ్మద్ బుధవారం తెలిపారు. 47 మందిలో 13 మంది విద్యార్థులు 100 శాతం మార్కులు సాధించారు. అదేవిధంగా 12వ తరగతిలో మొత్తం 31 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా వారిలో 30 మంది ఉత్తీర్ణులయ్యారని ఒకరికి కంపార్ట్‌మెంట్ లభించింది.కాగా వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇష్తియాక్ అహ్మద్ మంచి ఫలితాలు సాధించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ప్రతి యేటా 100 శాతం ఫలితాలు వచ్చేలా చూడాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులను వారు అభినందించారు.

శాతం చెరువును పూడ్చేస్తున్నారు


శాతం చెరువులో భారీగా వ్యర్థాల డంపింగ్

గోల్కొండ: చారిత్రక శాతం చెరువులో ప్రతి రోజు టన్నుల కొద్దీ వ్యర్థాల డంపింగ్ జరుగుతోంది. చెరువులో వ్యర్థాలు డంపింగ్ అవుతున్న తీరు చూస్తే ప్రభుత్వం ఈ చెరువును పూడ్చేస్తున్నదా అన్న అనుమానం కలుగుతుంది. గోల్కొండ కోట ప్రహరీ గోడను ఆనుకోని ఉన్న ఈ చారిత్రక చెరువుకు శతాబ్దాల చరిత్ర ఉంది. గోల్కొండ కోటకు రక్షణ కవచంగా నిర్మించిన కందకానికి దిగువనే ఈ చెరువు ఉంది. ఈ చెరువువర్షాకాలంలో వరద నీటితో నిండుకుండలా ఉంటుంది. జూబ్లీ హిల్స్, బంజారాహిల్స్ తదితర ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు టోలిచౌకీ మీదుగా నదీమ్ కాలనీ ఆనుకోని ఉన్న ఈ చెరువులో చెరుతుంది. భారీ వర్షాలు కురిసినప్పుడు నదీమ్ కాలనీని ఈ చెరువు ముంచేస్తుంది. రెండు దశాబ్దాల నుంచి ఇదే పరిస్థితి నెలకొని ఉంది. ముంపుకు తీసుకుంటున్న చర్యలు ఏ మాత్రం ప్రయోజనం ఇవ్వడం లేదు. మరోవైపు చెరువు పూడ్చివేతకు ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకున్నదా అనే అనుమానం కూడా స్థానికులు వ్యక్తం చెస్తున్నారు. చెరువు సుందరీకరణ, చెరువు చుట్టు పార్కు ఏర్పాటుతో పాటు మార్నింగ్ వాకర్స్ కోసం గ్రీన్‌వే నిర్మించడానికి ప్రతిపాదనలు అప్పట్లో సిద్ధమైయ్యాయి. అయితే అవన్ని ఎప్పుడో అటకేక్కాయి. గుర్తు తెలియని వ్యక్తులు చెరువులో ఆటో ట్రాలీలు, డీసీఎం వ్యాన్‌లలో ప్రతినిత్యం చెరువులోకి చెత్త, పూడ్చిన భవనాల వ్యర్థాలను చెరువులోకి డంపింగ్ చేస్తున్నారు.

అమలు కానీ పథకాలు..
సుమారు పది కోట్ల రూపాయలతో శాతం చెరువు అభివృద్ధి చేస్తామని బల్దియా అధికారులు గతంలో ప్రకటించారు. ఇందుకు గాను బల్దియా కమీషనర్‌తో పాటు ఉన్నతాధికారులు,ప్రజాప్రతినిధులు ఎన్నోమార్లు చెరువును పరిశీలించి వెళ్లారు. ముందుగా చెరువులో పూడికలు తీయడం ఆ తరువాత వాకర్స్ కోసం గ్రీన్ పాత్ నిర్మాణ పనులు ప్రారంభమైయ్యాయి. ఇందులో భాగంగా చెరువు కట్ట పోడవునా గ్రీన్ పెన్సింగ్ కూడా ఏర్పాటు అయింది. అయితే ఆ తరువాత ఈ పనులన్ని అటకేక్కాయి. ప్రస్తుతం రాత్రి కాగానే చెరువు కట్టపైనే కాకుండా చెరువులో కూడా వ్యర్థాల డంపింగ్ యద్దేశ్చగా కొనసాగుతుంది. దీంతో పలు చోట్ల ఫెన్సింగ్ కూడా ధ్వంసమైంది. మహమ్మదీ లైన్స్ నుంచి జమాలీ దర్వాజా వరకు గల చెరువు కట్ట నుంచి వెళ్లాలంటే దుర్గంధం వస్తుంది. చెరువు పోడవునా వేసిన వ్యర్థాలు కుల్లి దుర్గంధం వ్యాపిస్తుంది. చనిపోయిన జంతువుల కలేబరాలు సైతం చెరువు కట్ట మీదనే పారవేస్తున్నారు. దీంతో ఆ ప్రాంతంలో ఈగలు ఇతర విష కీటకాలు విజృంభించి ప్రజలకు రోగాలను అంటగడుతున్నాయి. ఏదేమైనా చారిత్రక చెరువును సుందరీకరించేందుకు అధికారులు ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని, చెరువులో జరుగుతున్న వ్యర్థాల డంపింగ్‌ను ఆపాలని కోరుతున్నారు.

ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలి

లిబర్టీ: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు చేయూతనివ్వాలని అఖిల భారత అసంఘటిత కార్మికుల ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి రుద్రాక్ష మల్లేష్ విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు ఆరు నెలలు గడుస్తున్నా డ్రైవర్ల సమస్యలు మాత్రం అలాగే ఉన్నాయని స్పష్టం చేశారు. సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఎన్నికల ప్రణాళికలో తాము అధికారంలోకి వస్తే ప్రతి ఆటో డ్రైవర్ కుటుంబానికి సంవత్సరానికి రూ. 12 వేలు చెల్లిస్తామని ఇచ్చిన హామీని ఆయన గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు వెంటనే ప్రతి ఆటో డ్రైవర్‌కు ఆర్థిక సాయం చేసేపందుకు ముఖ్య మంత్రి ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క వెంటనే చర్యలు చేపట్టాలని మల్లేష్ కోరారు. ఉపాధి లేక ఆటోలు నడుపుకుంటూ జీవనం సాగిస్తూ ఆటో డ్రైవర్లు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని జీవన స్థితిగతులు ఎంత మాత్రం మార్పు నోచుకోకుండా దయనీయ జీవితాలు వెల్లదీస్తున్నాయన్నారు.

టీవీ సీరియల్ మేకప్‌మెన్ దారుణ హత్య

- కార్మికనగర్ నిమ్స్‌మే మైదానంలో ఘటన
- సంఘటన స్థలాన్ని పరిశీలించిన ఎస్సార్ నగర్ ఏసీపీ
- ఆధారాలు సేకరించిన క్లూస్ టీమ్


మృతుడు చుక్కా చెన్నయ్య

రహమత్‌నగర్: రహమత్‌నగర్ డివిజన్ పరిధిలోని నిమ్స్‌మే మైదానంలో మంగళవారం రాత్రి ఓ యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. పోలీసుల సమాచారం మేరకు... కార్మికనగర్ చిల్లా వద్ద పక్కన ఉన్న నిమ్స్‌మే మైదానం లోపల గోడ వద్ద పడివున్న యువకుడి మృతదేహాన్ని గుర్తించిన నిమ్స్‌మే సెక్యూరిటీ సిబ్బంది బుధవారం ఉదయం పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఆర్‌నగర్ ఏసీపీ వెంకటరమణ, బోరబండ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ వీరశేఖర్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతుడు టీవీ సీరియల్స్ మేకప్‌మెన్‌గా పనిచేసే మహబూబ్‌నగర్ వనపర్తి ప్రాంతానికి చెందిన చుక్కా చెన్నయ్య అలియాస్ తరుణ్‌తేజ్(28)గా గుర్తించారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌ను రప్పించి ఆధారాలు సేకరించారు. మారణాయుధాలతో దాడి జరుగున్న క్రమంలో మృతుడు గాయాలతో పరిగెత్తి గోడ వద్ద కుప్పకూలి పోయి ఉంటాడని పోలీసులు అంచనాకు వచ్చారు. ఇదిలా ఉండగా మంగళవారం రాత్రి మృతుడు చెన్నయ్యతో పాటు ఎంత మంది నిమ్స్ మే మైదానంలోని వచ్చారు? ఎలా వచ్చారు? అనే వివరాలను పోలీసులు ఆరా తీస్తున్నారు. కార్మికనగర్, బస్ స్టాప్, కార్మికనగర్ శ్రీరాంనగర్ ఉన్న సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. ఈ మేరకు బోరబండ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.